సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



దివ్యాంగుల హితం అభిమతం

దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న ప్రభుత్వం శనివారం అనకాపల్లిలో వారికి పరికరాలు పంపిణీ చేసింది. 8లో



సింహగిరిపై ఆధ్యాత్మిక సందడి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



వంజంగికి పర్యాటకుల తాకిడి

సాక్షి,పాడేరు: వంజంగి హిల్స్‌కు శనివారం వేకువజాము నుంచి పర్యాటకుల తాకిడి పెరిగింది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ తరగతులు వాయిదా

రంపచోడవరం: సివిల్ సర్వీసెస్ గ్రూప్1, గ్రూప్2 ప్రవేశ పరీక్షలకు సంబంధించి గిరి యువతకు ఈ నెల 18 నుంచి ప్రారంభం కావాల్సిన శిక్షణ తరగతులను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని, ఈ మార్పును శిక్షణకు ఎంపికైన యువత గమనించాలని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచిన అధికారులు



రాఘవాపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపించిన అధికారులు

ఎటపాక: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె కారణంగా మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సమ్మె కారణంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో శిశుసంక్షేమ శాఖ ఎటపాక ప్రాజెక్ట్ సీడీపీవో విజయగౌరి శనివారం మండలంలోని 35 కేంద్రాలను తెరిపించారు. కేంద్రాల పరిధిలో లబ్ధిదారులకు పౌష్టికాహారం సరఫరా జరిగేలా సచివాలయ సిబ్బందికి సూచించారు.సీడీపీవోతో పాటు సూపర్‌వైజర్ రాధ, గౌరిదేవిపేట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం : ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుళ్ల ఉద్యోగాల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 50 మందికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఐడీ నంబరుతోపాటు పూర్తి వివరాలను స్థానిక మహిళా పోలీసుకు లేదా పోలీసుస్టేషన్ల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వీరందరికీ ఈనెల 23న సంబంధిత పోలీసుస్టేషన్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వీరిలో 50 మందిని ఎంపిక చేసిన 40 రోజుల పాటు అడ్డతీగల వైటీసీలో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధ్యాపకులతో ఉచిత శిక్షణ, మెటీరియల్ అందిస్తామని చెప్పారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



పాడేరులో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. అరకులోయలో 12, పాడేరు మండలం మినుములూరులో 13, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14,.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పాటు చలితీవ్రత అధికంగా ఉంది. రాత్రి సమయంలో గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

మిరియం రైతుకు మంచి రోజులు

మిరియం రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఈ ఏడాది దిగుబడి బాగున్నందున మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.మార్కెట్లో ధర కూడా కిలో.500 వరకు లభించే పరిస్థితులున్నాయి. గిరిజన సహకార సంస్థ కూడా కొనుగోలుకు కసరత్తు మొదలుపెట్టింది.

- కాఫీలో అంతరపంటగా సాగు
- ఈ ఏడాది ఆశాజనకంగా కాపు
- వచ్చే నెలలో సేకరణ
- కిలోకు రూ.500 ధర లభించే అవకాశం
- కొనుగోలుకు జీసీసీ కసరత్తు



విరగ్గాసిన మిరియం పాదులు



మోదాపల్లి ప్రాంతంలో కాఫీలో అంతర పంటగా మిరియం పాదులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో కాఫీ రైతులు అంతరపంటగా మిరియం సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈఏడాది వాతావరణం అనుకూలించినందున కాఫీలో మంచి దిగుబడి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. వచ్చే నెలలో సంక్రాంతి పండగ ముగిసిన వెంటనే గిరిజన రైతులు మిరియాల సేకరణలో నిమగ్నమవుతారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మిరియాల అమ్మకాల సీజన్ ఉంటుంది.

అంతరపంటగా 50 వేల ఎకరాల్లో..

ఏజెన్సీలోని కాఫీతోటల్లో అంతరపంటగా మిరియాలు సుమారు 50 వేల ఎకరాల్లో సాగవుతోంది.కాఫీ మొక్కలకు నీడనిచ్చే సిల్వర్‌ఓక్ చెట్లకు మిరియాల పాదులను ఎక్కించి సాగు చేస్తున్నారు. కాఫీతో పాటు మిరియాల సాగుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఐటీడీఏ ప్రోత్సహిస్తోంది. కాఫీ, మిరియం సాగు ద్వారా గిరిజన రైతులు మంచి లాభాలు పొందుతున్నారు. ఎకరాకు విస్తీర్ణంలోని మిరియం పాదులకు 450 కిలోల వరకు పచ్చి మిరియాలు దిగుబడి వస్తుంది. వాటిని శుద్ధి చేసి ఎండబెడితే 100 నుంచి 120 కిలోల వరకు దిగుబడి వస్తాయి.

ఎకరాకు రూ.60 వేల ఆదాయం

గత ఏడాది మిరియాలకు మార్కెట్‌లో మంచి ధర పలికింది.కిలో రూ.420నుంచి రూ.450 ధరతో వారపుసంతలు, ప్రధాన జంక్షన్లలో రైతులు విక్రయించారు. ఒడిశాతో పాటు జిల్లాలోని వ్యాపారులంతా పోటాపోటీగా మిరియాలను కొనుగోలు చేయడంతో ఎకరాకు రూ.60 వేల వరకు ఆదాయం పొందారు.

కిలో రూ.500కు అమ్మేలా..

ఏజెన్సీలోని గిరిజన రైతులు సాగుచేస్తున్న మిరియాలకు జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకు తగ్గట్టుగా మంచి ధరకు విక్రయించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ రైతులకు సూచిస్తున్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ నేపథ్యంలో తొలిసారిగా గిరిజన సహకార సంస్థ కూడా మిరియం కొనుగోలుకు సిద్ధపడుతోంది.

కిలో రూ.500కు విక్రయించాలి



ఏజెన్సీలోని మిరియం సాగు చేసే రైతులు గ్రామాల్లోని దళారుల మోసాలకు గురికావొద్దు. కిలో రూ.500 ధర చెల్లించే వ్యాపారులకు మాత్రమే మిరియాలను విక్రయించాలి. గిట్టుబాటు ధర వచ్చేంతవరకు రైతులు కాస్త వేచి ఉండాలి.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

మిరియం కొనుగోలుకు నిర్ణయం



ఏజెన్సీలో తొలిసారిగా జీసీసీ ద్వారా మిరియాల గింజలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించాం.కాఫీ గింజల మాదిరిగానే మిరియాలకు గిట్టుబాటు ధరను చెల్లిస్తాం. ఇందుకు సంబంధించిన విధి విధానాలపై కసరత్తు చేస్తున్నా

– జి.సురేష్‌కుమార్, ఎండీ, గిరిజన సహకార సంస్థ, విశాఖపట్నం

పేదల ముంగిటకే సంక్షేమ పాలన

- మెరుగుపడిన విద్యావ్యవస్థ
- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల ముంగిటకే సంక్షేమ పాలన అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌అన్నారు. శనివారం మండలంలోని బలిజపాడు, వంచంగి, కరుదేవపాలెం, చికిలింత, కొమరాపురం మీదుగా అమీనాబాద్ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ వాహనయాత్ర (రోడ్ షో) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి గిరిజన పక్షపాతి అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలు కూడా ఈ యాత్రలో తెలుసుకుంటున్నామని చెప్పారు. పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడం వల్ల గిరిజనుల ఆర్థిక స్థితిగతులు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. విద్యావ్యవస్థ ఎంతో మెరుగుపడిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను వారికి అందజేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరట్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, తొంటా ఆదిరాజు, ఆగూరి శుభలక్ష్మి, బూసరి సత్యనారాయణ, కించు వెంకటలక్ష్మి నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, నాగులాపల్లి కుశరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగిలో స్వర్ణోత్సవ సందడి

- భారీగా తరలివచ్చిన పూర్వ విద్యార్థులు
- అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా వేడుకలు



అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక శ్రీ అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ వేడుకలు తొలిరోజు శనివారం అంబరాన్నంటాయి. ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు, తమ చిన్ననాటి స్నేహితులను ఆలింగనం చేసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 1963 నుంచి ఇప్పటి వరకు ఈ పాఠశాలలో చదువుకున్న దాదాపు రెండువేల మంది ఈ అరుదైన వేడుకలకు కుటుంబ సమేతంగా విచ్చేశారు. తొలుత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ పూర్వ విద్యార్థులతో కలసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఎనిమిది అడుగుల అల్లూరి భారీ కాంస్య విగ్రహాన్ని విగ్రహదాతలు ముదునూరి సూర్యనారాయణరాజు సోదరులు ఆవిష్కరించారు. స్వర్ణోత్సవాల కమిటీ సభ్యులు పైలాన్ ప్రారంభించారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు బ్యాచ్‌ల వారీగా ఘనంగా సన్మానించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాదిగా వేడుకలకు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు శివరామచంద్రరాజు, అప్పారావు, వాడ్రేవు సుందరరావు, సంఘాని శ్రీనివాస జీవన్, పెరుమాళ్లరాజు, కృష్ణవర్మ, లూధర్‌బాబు, మణి, విఘ్నేశ్వరుడు, లక్ష్మణ్, నాగేంద్రకుమార్, రాజ్‌బుంగా, రెమిబాబు, ఇమ్మానియేలు, బద్రి, సత్యభాస్కర్, ప్రభాకర్, బషీరా, సావిత్రి, లక్ష్మి, నీలవేణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముమ్మరంగా పంట నష్టం సర్వే



నల్లకుంటలో నష్టాన్ని నమోదు చేస్తున్న అధికారులు

ఎటపాక: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన పంటల సర్వే ముమ్మరంగా చేస్తున్నారు. వర్షానికి నష్టపోయిన పంటలను అన్ని సచివాలయాల పరిధిలో గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం గౌరిదేవిపేట, నల్లకుంట తదితర పంచాయతీల నష్టం వివరాలను లెక్కించారు. వీఆర్వో కన్నమ్మ,అగ్రికల్చర్ అసిస్టెంట్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు మాలందొర ఎంపిక



మాలందొరను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, అధ్యాపకులు

సాక్షి,పాడేరు: మైసూరులో ఈనెలాఖరున జరిగే జాతీయ స్థాయి యూనివర్సిటీ క్రీడా పోటీలకు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మాలందొర అర్హత సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మాలందొరను శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి,పీడీ ప్రసాద్‌నాయుడు,వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్ రసూల్, ఇతర అధ్యాపకులు అభినందించారు. ఆంధ్రా యూనివర్సిటీ జట్టు తరఫున పోటీల్లో మాలందొర పాల్గొంటాడని వారు పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

- చింతపల్లిలో పర్యటించే అవకాశం
- కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లిలో పర్యటించే అవకాశం ఉన్నందున ఈకార్యక్రమం విజయవంతానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్ నుంచి జిల్లాలోని పలుశాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఈనెల 21వతేదీ ఉదయం 11గంటలకు చింతపల్లి చేరుకుని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికారులంతా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. హెలీప్యాడ్‌తో పాటు బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ ఈఈని ఆదేశించారు. రవాణాకు ఇబ్బందులు లేకుండా రహదారిలో బారికేడ్లు, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించడంతో పాటు సభా వేదిక ప్రాంతాన్ని శుభ్రం చేసి బ్లీచింగ్ జల్లాలన్నారు. సభాస్థలిలో ఎగుడుదిగుడు లేకుండా మైదానాన్ని తీర్చిదిద్దాలని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల సుందరీకరణ పనులను విద్యాశాఖ చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు నాలుగు లక్షల ఎకరాలకు అటవీ హక్కుపత్రాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మరో 500మంది గిరిజనులకు సీఎం చేతులమీదుగా ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమారు 10 వేలమంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారందరికి తాగునీటి సమస్య లేకుండా సురక్షిత తాగునీటిని పంపిణీ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనకు సంభందించి ఉన్నత స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశామని కలెక్టర్ పేర్కొన్నారు. జేసీ శివశ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌కిషోర్, డీఆర్‌డీఏ పీడీ మురళి, పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు బాలసుందరబాబు, డీవీఆర్ఎం రాజు, లీలాకృష్ణ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: చింతపల్లిలో ఈనెల 21న జరగనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు నేతలు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావుతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత అనేకసార్లు పర్యటించాల్సి ఉన్నప్పటికి ప్రతికూల వాతావరణంతో వాయిదాలు పడ్డాయని, ఈసారి తప్పనిసరిగా సీఎం పర్యటిస్తారన్నారు. చింతపల్లి పర్యటనలో 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను సీఎం పంపిణీ చేస్తారన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు కూడా ఆదేరోజు కావడంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత నెలకొందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జిల్లా వ్యాప్తంగా పార్టీశ్రేణులంతా భారీగా తరలిరావాలని, చింతపల్లిని జనసంద్రంగా మార్చే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్గన్నదొర, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎస్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, సభ్యుడు మినుముల కన్నాపాత్రుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,లకే రామకృష్ణపాత్రుడు, సల్లా చిట్టమ్మ, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, బసవన్నదొర, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పసుపుల సత్యనారాయణ, జిల్లా సభ్యుడు దశమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పసుపునకు భౌగోళిక గుర్తింపు తెచ్చేందుకు కృషి



మాట్లాడుతున్న భారతీయ పరిశోధన మండలి సంచాలకుడు డాక్టర్ షేక్ మీరా

చింతపల్లిరూరల్: గిరిజన ప్రాంతంలో పండించే పసుపునకు భౌగోళికంగా గుర్తింపు తెచ్చేందుకు కృషివిజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, పదవ జోన్ (అటారీ,హైదరాబాద్) సంచాలకుడు డాక్టర్ షేక్ మీరా అన్నారు. మండలంలోని చౌడుపల్లిలో శనివారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పండించే పసుపులో కుర్క్యుమిన్ శాతం అధికంగా ఉందన్నారు. రైతులు గ్రామాల్లో ఉన్న ఎఫ్‌పీవోల ద్వారా, ఆన్‌లైన్‌లో విక్రయించడం ద్వారా మంచి ధర పొందవచ్చన్నారు. అనంతరం లంబసింగి ఎఫ్‌పీవో రైతులకు పసుపు ఉడకబెట్టే, పాలిస్ యంత్రాలు, చిరుధాన్యాల మిక్సర్, విత్తనాలు భద్రపరచుకునే డ్రమ్ములను అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ పి.పి మురుగన్, శాస్త్రవేత్తలు శైలజ, పాత్రో, శ్రీహరి, నాగేంద్ర, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు అరకు విద్యార్థి దేశాయ్



జాతీయస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన విద్యార్థి దేశాయ్‌తో ప్రిన్సిపాల్, కోచ్ తదితరులు

అరకులోయ టౌన్: జాతీయస్థాయి విలువిద్య పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సోడే దేశాయ్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న దేశాయ్ ఈనెల 13వ తేదీన విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా మీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడున్నారు. ఈనెల 19 నుంచి 22 వరకు పంజాబ్ రాష్ట్రం గురుఖానీ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ఆయన పేర్కొన్నారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ కె. నాగరాజు, పీడీ ఎస్. అప్పారావు, అధ్యాపక బృందం విద్యార్థి దేశాయ్‌ను అభినందించారు.

క్లుప్తంగా

మంత్రి రోజా దృష్టికి కార్మిక సమస్యలు



మంత్రి రోజాను కలిసిన స్వాతిరాణి, టూరిజం కార్మిక సంఘం ప్రతినిధులు

సాక్షి, పాడేరు: రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా, ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రంజిత్ భార్గవ్‌లను జీసీసీ మాజీ చైర్ పర్సన్, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ శోభ స్వాతిరాణి, టూరిజం కార్మిక సంఘం నేతలు శనివారం విజయవాడలో కలిశారు. జిల్లాలోని టూరిజం శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన కార్మికుల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి రోజా హామీ ఇచ్చినట్టు డాక్టర్ శోభ స్వాతిరాణి విలేకరులకు తెలిపారు.

దుర్గమల్లేశ్వరస్వామి ప్రచార రథానికి ఘన స్వాగతం



పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామాల్లో ఇంద్రకీలాద్రి నుంచి వచ్చిన శ్రీదుర్గ మల్లేశ్వరస్వామి వారి రథం యాత్ర భాజా భజంత్రీల నడుమ, భక్తుల కోలాహలం నడుమ సాగింది. మండలంలోని బోర్నగూడెంలో ప్రారంభమైన రథయాత్ర ఉర్లాకులపాడు, సంజీవనగరం, జడ్డంగి, రేవటిపాలెం మీదుగా సాగింది. భక్తులు అడుగడుకున అమ్మవారికి హారతులు పడుతు, పసుపు కుంకుమలు సమరిృంచారు. జడ్డంగికి చెందిన గురుభవానీ తోట సూరిబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు వైజాగ్ మారథాన్

బీచ్‌రోడ్డు: వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఆదివారం సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ రెండో ఎడిషన్ నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. తెల్లవారుజాము 4.45 గంటలకు ఫుల్ మారథాన్, ఉదయం 5 గంటలకు హాఫ్ మారథాన్, 5.30 గంటలకు 5కె రన్, 6.15 గంటలకు 3కె రన్ ప్రారంభమవుతుందన్నారు.

దివ్యాంగుల హితం అభిమతం

- ఏడీఐపీ స్కీం కింద రూ.1.62 కోట్లతో ఉపకరణాలు అందజేత
- జిల్లాలో 1343 మందికి 2016 పరికరాలు పంపిణీ
- దివ్యాంగులకు అందించిన కేంద్ర మంత్రి, వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి, ఎంపీ సత్యవతి
- వీటిలో ఎంపీ లాడ్స్ 32లక్షలతో 193 మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు



దివ్యాంగులకు మోటార్ ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన అనంతరం కేంద్ర మంత్రి నారాయణస్వామి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ సత్యవతి చిత్రంలో కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి

సాక్షి, అనకాపల్లి: దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. వారిలో ఆత్మస్థైర్యం నింపి సకలాంగులకు తీసిపోని విధంగా అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తున్నాయి. దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడీఐపీ స్కీం కింద ఉచితంగా ఉపకరణాలు అందజేస్తున్నాయి. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున శనివారం అనకాపల్లిలో దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేని విధంగా కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన 1,343 మంది దివ్యాంగులకు రూ.1.62కోట్ల విలువైన 2016 పరికరాలు పంపిణీ చేశారు. వీటిలో ఎంపీ నిధులు రూ.32లక్షతో 193 మందికి మోటార్ ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు.

అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత(దివ్యాంగన్) మంత్రి నారాయణస్వామి ఈ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కేంద్ర మంత్రి నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ రీజనల్‌కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టినందువల్లే వారి సహకారంతో ఇంతటి బృహత్ కార్యక్రమం సాధ్యమైందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎంపీ సత్యవతి దివ్యాంగులకు ఉపకరణాలను అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో దివ్యాంగులకు అర్హతతో సంబంధం లేకుండా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న అనకాపల్లి జిల్లాను సీఎస్సార్ నిధులతో మరింత అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా కేంద్రమంత్రి నారాయణ స్వామికి తెలియజేశారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ ఇంత భారీ ఎత్తున ఉపకరణాలు అందించడం ఎంపీ డాక్టర్ సత్యవతి చొరవతోనే సాధ్యమైందన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ. 32 లక్షలతో 192 మందికి బ్యాటరీతో నడిచే మోటర్ ట్రై సైకిళ్లు, 130 ట్రై సైకిళ్లు, 265 చక్రాల కుర్చీలు, 28 సీపీ చైర్లు, 55 వాకింగ్ స్టిక్స్, 608 వినికిడి మిషన్లు అందించామన్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ ఇంతటి బృహత్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, అధికారులు జిల్లా యంత్రాంగం సహకరించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. వచ్చే నెలలో దివ్యాంగులను గుర్తించేందుకు మరో శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పారిశ్రామికవేత్తలు కూడా దీనికి సహకారం అందించాలని కోరారు.

నృత్యాలతో అలరించిన దివ్యాంగ బాలికలు

బధిరులైన బాలికలు పాటకు అనుగుణంగా చేసిన నృత్యం అందరినీ అలరించింది. తమ నృత్యాలతో కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చు నిరూపించారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర మేయర్ హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఏపీడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణరాజ్, దివ్యాంగ శాఖ ఏడీ జగదీష్, డీఆర్‌డీఏ పీడీ శచిదేవి, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు ఈర్లె అనురాధ, పలకారవి, మందపాటి జానకీరామరాజు, కాండ్రేగుల విష్ణుమూర్తి, జాజుల రమేష్, బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, గొర్లి సూరిబాబు, మళ్ల బుల్లిబాబు, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామూర్తి పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు

గంగవరం: క్షయ నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ప్రకృతి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జి.సుబ్బరాజు చెప్పారు.మండల కేంద్రంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా క్షయవ్యాధి అంతానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. తమ సంస్థ ద్వారా ఏజెన్సీలో క్షయ లక్షణాలున్న వారిని గుర్తించి పరీక్షలు చేస్తున్నామన్నారు.వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 510 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తుల సమాచారాన్ని గోప్యం ఉంచుతామని, వారికి 25రకాల హక్కులు ఉన్నాయని ఆయన వివరించారు. నిరంతరం దగ్గు వస్తే క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం 2025నాటికే టీబీ నివారణకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఏడాది గ్రామ స్థాయిలో క్షయ వ్యాధిపై మరింత ప్రజల్లో చైతన్యం చేసేందుకు సర్పంచులతో ఎంవోయూ చేసుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ కో–ఆర్డినేటర్లు కె.రాంబాబు, కె.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు



ప్రజావేదిక కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఉన్నతాధికారులు

జి.మాడుగుల: మండలంలో ఉపాధి హామీ పథకంలో ఎటువంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహించి అర్హులైన లబ్ధిదార్లకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈజీఎస్, పీఆర్, ఐటీడీఏ, ఎస్ఎంఐ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా 2022–2023సంవత్సరంలో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ శివయ్య, విజిలెన్స్ డీవీవో నిర్మలాదేవి ఏపీడీ గిరిబాబులు సామాజిక తనిఖీ ప్రజావేదిక(ఏపీఎస్ఎస్ఎటి) కార్యక్రమం నిర్వహించారు. ఎం.బుక్‌లో పనులు పేమెంట్ జనరేట్, , నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవటం రికార్డు సరిగా లేకపోవటం, మరణించిన వారి పేర్లతో పేమెంట్లు తప్పులు దొర్లటంపై కంప్యూటర్ అపరేటర్, గత ఏపీవో రామేశ్వరంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కోరాపల్లిలో గతేడాది పనులు చేసిన ఏడుగురికి కూలీ జమకాలేదని ప్రజావేదికలో చదివి వినిపించారు. తక్షణమే లోపాలన్నీ సరి చేయాలని ఆయన ఆదేశించారు. పలు గ్రామాల్లో పనులు కల్పించకపోవడంపై ఆయన తప్పుపట్టారు. పంచాయతీల్లో మరణించిన వారి పేర్లతో పెన్షన్ సొమ్ము అక్రమాలపై సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేసి శాఖాపరమైన చర్యలు చేపడుతున్నట్టు పీడీ వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద 971పనులకు రూ.12,55,57,372కాగా ఇందులో వేజ్ పేమెంట్ రూ.12,33,97,310 మెటీరియల్ రూ.2160062 నిధులకు ఆడిట్ జరిగింది. అలాగే పీఆర్ 64పనులకు రూ.1,78,43,564 విలువ గల పనులు చేపట్టారు. ఐటిడీఏ కింద చేపట్టిన 28 పనులకు రూ.1,68,65,324 విలువ గల పనులు ఎస్ఎంఐలో ఐదు పనులకు రూ.26,36,616 విలువ పనులకు ఆడిట్ జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ కింద చేపట్టిన ఏడు పనులకు రూ.16,92,810 విలువ గల పనులకు ఆడిట్ నిర్వహించారు. ఎంపీడీవో లోహిత్ జయసాగర్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ సూర్యచక్రరాం, డీఆర్‌పీలు ఎం.సూరిబాబు, సత్తిబాబు, అర్జునవర్మ, సతీష్, ఐకేపీ ఏపీఎం సుందరమ్మ, ఉపాధి ఏపీఎంలు గంగాధర్, రామేశ్వరం , ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, లంబూరి అప్పలరాజు, రవనీ, చిట్టిబాబు, సర్పంచ్‌లు మాలన్న, సూరిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1, గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షలపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎస్.శ్రీదేవి తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. గ్రూప్–1 శిక్షణకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 60 మందిని ఎంపిక చేయనుండగా.. జనవరి 5వ తేదీ నుంచి 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. గ్రూప్–2 శిక్షణకు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు 40 మందిని ఎంపిక చేయనుండగా ఈ నెల 27వ తేదీ నుంచి 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను స్టడీ సర్కిల్‌లో అందించాలన్నారు. పూర్తి వివరాలకు 0891–2564346, 9492569177 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆరోగ్య 'సిరి'

- చిన్నారులకు త్రుణధాన్యాలను చేరువ చేసే విధంగా ఉత్పత్తులు
- నేటితో ముగియనున్న ఆర్గానిక్ మేళా



త్రుణధాన్యాలతో చేసిన అటుకులు

ఏయూక్యాంపస్: తృణధాన్యాలను చిన్నారులకు చేరువ చేసే విధంగా పలు సంస్థలు కృషి చేస్తున్నాయి. జొన్నలు, సజ్జలు, ఊదలు, రాగులు వంటివి ఉపయోగించి చిన్నారులు ఇష్టంగా తినే తినుబండాలు తయారు చేస్తున్నాయి. వీటిని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న విశాఖ ఆర్గానిక్ మేళాలో పలువురు విక్రయిస్తున్నారు. మిల్లెట్స్‌ను ఉపయోగించి తయారు చేసిన బిస్కెట్లు, నూడిల్స్, సేమ్యా, రస్కులు, చిప్స్ వంటి ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు పాలల్లో వేసుకుని తినడానికి వీలుగా ఉండే రాగి, జొన్న, సజ్జ అటుకులు విక్రయిస్తున్నారు.



త్రుణధాన్యాలతో తయారుచేసిన వస్తువుల విక్రయాలు

నేటితో ముగియనున్న మేళా

ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన నాల్గో విశాఖ ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగియనుంది. ఈ మేళాలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, రైతులు 160 స్టాళ్లలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార పదార్థాలు, ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఆదివారం మిద్దె తోటలు పెంపకం చేసే వారితో సదస్సు నిర్వహిస్తున్నారు. సందర్శకుల కోసం ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయగా.. సేంద్రియ ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ వంటకాల రుచులను ప్రజలు ఆస్వాదిస్తున్నారు.